సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



87వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి కాలనీలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదేశాల మేరకు వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్సీ ఎన్నికల కో–ఆర్డినేటర్ జి.పూర్ణానంద్‌శర్మ, జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, ప్రగడ శ్రీనివాస్, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, ప్రగడ శంకరరావు, బద్ద తాత, సబ్బవరపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

19న కళా తపస్వి 93వ జయంతి వేడుకలు

మద్దిలపాలెం: కళా తపస్వి కె.విశ్వనాథ్ 93వ జయంతి వేడుకలను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నామని సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. సీనియర్ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. అనంతరం స్వాతిముత్యం చిత్రాన్ని ప్రదర్శిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94415 71581 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అలరించిన స్వర సంగమం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

సీతంపేట: శారదా స్వర సంగమం ఆధ్వర్యంలో ప్రముఖ దర్శకుడు పద్మశ్రీ కె.విశ్వనాథ్, పద్మభూషణ్ వాణీజయరామ్‌లకు స్వర నివాళి అర్పించారు. విశాఖ పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాన్ని సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, దూరదర్శన్ మాజీ డైరెక్టర్ పీజే సుధాకర్, ఆచార్యులు రాజేంద్రప్రసాద్, లోకేష్, చెన్నా తిరుమలరావు తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా కె.విశ్వనాథ్, వాణీ జయరామ్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. గాయనీ గాయకులు లోకేష్, లక్ష్మీ స్వరూప, లక్ష్మీసాత్విక, శ్రీగిరి, శైలజ కుమారి, వెంకటేష్, నాయుడు, నాగలక్ష్మి, కె.ఎల్.రావు, శ్రీదేవి, కవిత, సుజని, శ్వేత, దుర్గాప్రసన్న, లక్ష్మణ్ పలు హిట్ సాంగ్స్‌ను ఆలపించి ప్రేక్షకులను అలరించారు.

కల్యాణం .. కమనీయం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606

ఆక్రమణలపై ‘ఉక్కు’పాదం

- స్టీల్‌ప్లాంట్ భూముల పరిరక్షణకు కదిలిన యంత్రాంగం
- క్షేత్రస్థాయిలో విచారణ
- హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన స్థలాల ఆక్రమణదారులపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. స్థలాల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపడుతున్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో, రెవెన్యూ సిబ్బంది ఆయా స్థలాలకు సంబంధించి, క్షేత్ర స్థాయిలో విచారణ చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..
ఉక్కు భూములపై కబ్జాదారుల కన్ను పడింది. నిర్వాసిత కాలనీల్లో ప్రజా ప్రయోజనార్థం కేటాయించిన, రహదారి మార్జిన్ల కోసం వదిలేసిన, నిర్వాసితులకు కేటాయించగా మిగిలిన భూములను దర్జాగా కబ్జాలు చేయడం, ఆపై నకిలీ పత్రాలు సృష్టించడం, లక్షలాది రూపాయలకు అమ్ముకోవడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా పెదగంట్యాడ మండలంలోని నడుపూరు, నెల్లిముక్కు, శీరవానిపాలెం, అయ్యన్నపాలెం, పెదగంట్యాడ తదితర నిర్వాసిత కాలనీలు, అలాగే అగనంపూడి, వడ్లపూడి, కొత్త దిబ్బపాలెం ఏరియాల్లో ఈ తరహా దందాలు ఎక్కువైపోయాయి.



బాలచెరువు ఏరియాలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

భూ కబ్జాలపై దృష్టి
ఈ నేపథ్యంలో కొత్తగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వచ్చిన రామ్మోహనరావు భూ కబ్జాలపై దృష్టి సారించారు. ఎక్కడెక్కడ భూములు ఖాళీగా ఉన్నాయో వాటి వివరాలు సేకరిస్తున్నారు. నిర్వాసితులకు కేటాయించిన స్థలాలపైనా ఆరా తీస్తున్నారు. వాటితో పాటు కమ్యూనిటీ హాల్స్, పార్కుల కోసం వదిలేసిన స్థలాలను పూర్తి స్థాయిలో లెక్క కట్టి, మిగిలిన స్థలాలను స్వాధీనం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆర్ కార్డు ఉన్నా స్థలాలు కేటాయించని వారికి వీటిని కేటాయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



నడుపూరులో..

ఉక్కు స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఉక్కు స్థలాలు ఆక్రమణకు గురి కావడంతో వాటిని గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నాం. మళ్లీ ఎవరైనా వాటి జోలికెళ్తే కఠిన చర్యలు తీసుకుంటాం. స్టీల్‌ప్లాంట్ స్థలాలను ఆక్రమించి, నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చేస్తాం. ఆర్ కార్డుదారులకు కేటాయించిన స్థలాల వివరాలు మా కార్యాలయంలో ఉన్నాయి. ఎవరైనా ఆ స్థలాలు కొనుగోలు చేసే ముందు వాటి పూర్తి వివరాలతో పాటు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయా లేవా అని సరి చూసుకోవాలి. నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించుకోవాలని చూస్తే క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా వెనుకాడం.

– జి.వి.వి.రామ్మోహనరావు, స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

విదేశీ విద్యకు సెక్యూరిటీ లేకుండా రుణాలు



ఖాతాదారుకు రుణం అందిస్తున్న యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ అధికారి మూర్తి

ఉక్కునగరం: విదేశాల్లో ఎంపిక చేసిన విశ్వవిద్యాలయాల్లో చదువుకునే విద్యార్థులకు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా రూ. 40 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజనల్ ఆఫీసర్ ఐ.ఎస్.ఎస్. మూర్తి తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మంగళవారం ఏర్పాటు చేసిన రిటైల్ లోన్ క్యాంప్‌ను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి తక్కువ వడ్డీ రేట్లతో, ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా సత్వరమే గృహ మరియు వాహన రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. వ్యక్తిగత రుణాలు కూడా ఇస్తున్నామని తెలిపారు. దగ్గరలో ఉన్న యూనియన్ బ్యాంక్‌లో ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని ఆయన ఖాతాదారులను కోరారు. బ్రాంచ్ మేనేజర్ ఆశిష్ సిన్హా మాట్లాడుతూ కార్యక్రమంలో 23 మందికి సుమారు రూ. 10.44 కోట్లు రుణాలు మంజూరు పత్రాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విద్యా గణపతి ఆలయ వార్షికోత్సవం



విద్యా గణపతికి పూజలు చేస్తున్న వంశీరెడ్డి, దేవన్‌రెడ్డి, ఎమిలీ జ్వాల తదితరులు

పెదగంట్యాడ: బీసీ రోడ్డులోని బజాజ్ షోరూం ఎదురుగా కొలువై ఉన్న విద్యా గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. గణనాథుడిని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, ఎమిలీ జ్వాల దంపతులు, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి దర్శించుకుని, పూజలు చేశారు. వంశీరెడ్డి మాట్లాడుతూ 2012లో ఇక్కడ పాఠశాల ఏర్పాటు చేసే సమయంలో గణపతి విగ్రహం బయట పడిందని, దీంతో విద్యా గణపతిగా నిత్యం పూజలు చేస్తున్నామని తెలిపారు. వేడుకల్లో ఎస్.వై. నాయుడు, దుర్గారావు, నాయుడు, గొరుసు రామలక్ష్మి, ఒమ్మి ఈశ్వరి, దల్లి పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో ఉక్కు ఉద్యోగులకు పతకాలు



పతకాలు సాధించిన ఉక్కు ఉద్యోగులు

అగనంపూడి: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఖరగ్‌పూర్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఉక్కు ఉద్యోగులు సత్తా చాటారు. రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, పోల్ వాల్ట్‌లో విజేతలుగా నిలిచి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో 16 రాష్ట్రాల నుంచి 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న అగనంపూడి పెదమడక కాలనీకి చెందిన విందుల శ్రీనివాసరావు, మత్రిపాలేనికి చెందిన దుల్ల గోపీ, కణితి కాలనీకి చెందిన శిరపనశెట్టి మోహన్ ఉన్నారు. వారిలో విందుల శ్రీనివాసరావు 10 కిలోమీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 1500 మీటర్ల పరుగులో రజత పతకం కైవసం చేసుకున్నారు. దుల్ల గోపీ షాట్‌పుట్‌లో రజత పతకం, డిస్కస్ త్రోలో సిల్వర్ మెడల్, పోల్ వాల్ట్‌లో కాంస్య పతకం సాధించారు. శిలపరశెట్టి మోహన్ 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో మూడు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. విజేతలను అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

23న బీహెచ్‌ఈఎల్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

గాజువాక: బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఎన్నిక ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి సీహెచ్.ఎస్.త్రినాథరావు ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థుల నుంచి ఈ నెల 15న నామినేషన్లను స్వీకరిస్తారు. 16వ తేదీన నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. 17న నామినేషన్ల ఉపసంహరణలు ఉంటాయి. 23న ఎన్నికలు పూర్తయిన అనంతరం అదేరోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారు.

ఎనిమిది మంది డైరెక్టర్ల ఎన్నిక
ఈ ఎన్నికల్లో 472 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకుంటారు. వారు మొత్తం ఎనిమిది మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. గెలిచిన పాలకవర్గం సొసైటీ అధ్యక్ష కార్యదర్శులను, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటుంది. కోశాధికారిని యాజమాన్యం నియమిస్తుంది. బీహెచ్‌ఈఎల్‌లో ఇప్పటికే కో ఆపరేటివ్ ఎన్నికల సందడి నెలకొంది.

ఐక్య పోరాటాలతోనే విజయం



733వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నామంటూ పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసే వరకు కార్మికుల పోరాటం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 733వ రోజు సంస్థకు చెందిన డబ్ల్యూఆర్‌ఎం–1 మరియు 2 విభాగ కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, అయోధ్యరామ్, గుమ్మడి నరేంద్ర, వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ కులమతాలకు అతీతంగా ఐక్యపోరాటాలు జరుగుతున్నాయన్నారు. పోరాటాలను విచ్ఛిన్నం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలు పన్నుతోందని, వాటిని ఐక్యంగా తిప్పికొడితేనే విజయం సాధ్యపడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, కార్మికులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.ఎ‌స్.ఎన్.రావు, ఎన్. రామారావు, బొడ్డు పైడిరాజు, మస్తానప్ప, సీహెచ్ సన్యాసిరావు, అప్పారావు, పరంధామయ్య, కార్మికులు పాల్గొన్నారు.

భద్రతపై మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మహిళలకు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో వివిధ వర్గాలకు అవగాహన కల్పిస్తున్నారు. ఉక్కు మల్టీపర్పస్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వంట గది, గ్యాస్ భద్రతపై మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐవోసీఎల్ మేనేజర్ ఎం.బి.ఉమాదేవి వివరించారు. వంట గదిలో గ్యాస్ లీకేజీ, మంటలు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. సీఐఎస్ఎఫ్ ఏఎస్ఐ వెంకటరావు, రమణ అగ్నిప్రమాదాలు జరిగినపుడు వాటిని ఆర్పడాన్ని ప్రత్యక్షంగా పరికరాల ద్వారా వివరించారు. ట్రాఫిక్ సీఐ జి. ఉమామహేశ్వరరావు రహదారి భద్రత, నిబంధనల గురించి వివరించారు. ముఖ్యంగా ఓవర్ స్పీడ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరుగుతున్న అనర్థాలను తెలియజేశారు. ఉద్యోగులకు, గృహిణులకు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో భద్రతా విభాగం జీఎం జె. రాజేంద్రన్, డీజీఎం ఎం. వరప్రసాద్, అధికారులు శేషగిరిరావు, చింతా మోహన్‌రావు, ఆర్. మాధవకుమార్, పి. కృష్ణమూర్తితో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి

డీఈవో చంద్రకళ



విద్యార్థుల వర్కు పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

మురళీనగర్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ ఆదేశించారు. మాధవధారలోని జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడంతోపాటు, గణితంలో చతుర్విద ప్రక్రియలు సాధించాలన్నారు. ఒకటి, రెండో తరగతి విద్యార్థుల పఠణ సామర్థ్యాన్ని ఆమె పరిశీలించి ప్రశంసించారు. నాలుగు, ఐదు తరగతుల్లో విద్యార్థులు సామర్థ్యాల సాధనలో వెనుకబడి ఉన్నారని దీనిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వర్కు బుక్స్, నోట్స్ పరిశీలించిన ఆమె పెండింగ్‌లో ఉన్న వాటిని రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లను రోజూ వినియోగించడంతోపాటు సబ్జెక్టుల వారిగా సాధనా కార్యక్రమాన్ని అమలు చేయాలని చెప్పారు. బైజూస్ కంటెంట్‌ను తక్కువగా ఉపయోగిస్తున్నట్లు ఆమె గమనించారు. ఉపాధ్యాయులు బైజూస్ కంటెంట్ వినియోగం విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థుల నోట్సులను ఎప్పటికప్పుడు దిద్దాలని తప్పులను సరిచేసి సరైన జవాబులను వారితో రాయించాలన్నారు. ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళిక పత్రాలను, డైరీలు, ఇతర ప్రగతి నివేదికలను పరిశీలించారు. హెచ్‌ఎం నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

వ్యాయామంతో వ్యాధులు దూరం



ర్యాలీని ప్రారంభిస్తున్న దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రాజా



ర్యాలీలో పాల్గొన్న గాజువాక పీహెచ్‌సీ వైద్యులు



క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

- సైక్లింగ్ మంచి ఎక్సర్‌సైజ్
- వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలు
- పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు

పెదగంట్యాడ: సైక్లింగ్‌ను మించిన వ్యాయామం లేదని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.ప్రదీప్ రాజా అన్నారు. ఆయుష్మాన్ భారత్ బ్లాక్ లెవెల్ ఆరోగ్య మేళాలో భాగంగా దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీ ప్ రాజా మాట్లాడుతూ నిత్యం వ్యాయామం చేస్తే రోగాలు దరి చేరవని చెప్పారు. పొగాకు వాడి, క్యాన్సర్ బారిన పడవద్దని కోరారు. అనంతరం ఇస్లాంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో కలసి దేవాడ పీహెచ్‌సీ నుంచి ఇస్లాంపేట హైస్కూల్ మీదుగా కేఎస్ పాలెం సచివాలయం వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు, వి.కృపాళిని, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..
పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్తపోటును నియంత్రించడానికి సైక్లింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతి అన్నపూర్ణ, తనకాల సత్యనారాయణ, నడుపూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గాజువాక పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ
గాజువాక: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య సిబ్బంది మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వివిధ జబ్బులపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ఈ ర్యాలీని స్థానిక వండడుగుల రోడ్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తే జబ్బులకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.పద్మ, ఎం.నాగరాజు, సీహెచ్‌వోలు పి.నాగ అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ..
కూర్మన్నపాలెం: వడ్లపూడి ప్రాంతంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వడ్లపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వైద్య ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ సోకితే, ఆ కుటుంబ మొత్తం మానసిక కుంగుబాటుకు లోనవుతుందన్నారు. ఇటువంటి వ్యాధిపై ప్రజల్లో అవగాహన అవసరమని చెప్పారు. వ్యాధి శరీరాన్ని కుంగదీస్తే భయాలు, అనుమానాలు, బెంగ మనసును కుంగదీస్తాయన్నారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తించి చికిత్స చేయించుకుంటే వ్యాధిని గెలవవచ్చన్నారు. మద్యపానం, ధూమపానం వంటివి క్యాన్సర్ వ్యాధికి కారకాలు అవుతాయని, అందువల్ల పొగాకు, మద్యానికి ప్రజలు దూరంగా ఉండా లని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, ఎంపీహెచ్‌ఈవో బాబీ, కొండమ్మ, కమల, లక్ష్మి, రాజు, ఉమ తదితరులు పాల్గొన్నారు.

కారాగారంలో తాజా కూరగాయలు



జైలు ఆవరణలో క్యాబేజీ, టమాటా పంటలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఓపెన్ ఎయిర్ ఖైదీలు పండించే తాజా కూరగాయలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం ముల్లంగి, క్యాబేజీ, టమటా, దోస, ఆనప, తదితర కూరగాయలను జైలు గేటు ముందు సుమారు నాలుగు ఎకరాలలో పండిస్తున్నారు. వీటి సాగులో ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ ఎరువులు వినియోగిస్తున్నారు. నిత్యం ఇక్కడ కాలానుగుణంగా కూరగాయల పంటల సాగు చేపడుతున్నారు. ఈ కూరగాయలను ఖైదీల భోజనాలకు వినియోగిస్తారు. ఇంకా మిగిలిన కూరగాయలను బయట విక్రయానికి అందుబాటులో ఉంచుతున్నారు. ముల్లంగి, క్యాబేజీ తదితర ఉత్పత్తులను బీఆర్‌టీఎస్ ఆనుకుని జైల్ ప్రధాన ద్వారం వద్ద నిర్వహిస్తున్న సుధార్ కేంద్రంలో విక్రయానికి పెట్టారు. ఈ కేంద్రంలో జైలులో ఖైదీలు తయారు చేసే కేకులు, బిస్కెట్లు, తువ్వాళ్లు, మ్యాటీలు, తదితర వాటిని కూడా విక్రయిస్తున్నారు. రసాయనాలు లేని కూరగాయలు, తాజా, రుచితో కూడినవి కావడంతో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.



పొలంలో ముల్లంగి తీసి శుభ్రం చేస్తున్న ఓపెన్ ఎయిర్ ఖైదీ

మహిళా కళాశాలలో అమర వీరులకు శ్రద్ధాంజలి



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం పుల్వామా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ముష్కరుల దాడిలో మృతి చెందిన వారి సంస్మరణార్థం కొవ్వొత్తులు వెలిగించి, ర్యాలీ చేశారు. అమర వీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె. గీతాంజలి, కళాశాల అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ కె.సుధ, విద్యార్థినులు పాల్గొన్నారు.

నైతిక విలువలు అంతర్భాగం కావాలి

ఏయూ క్యాంపస్: నైతికత, విలువలు విద్యార్థి దశ నుంచి మనలో భాగం కావాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా యోగా విద్యకు ప్రాముఖ్యత, ప్రాచుర్యం పెరుగుతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మెరుగైన సామర్థ్యాలను పొందే ప్రయత్నం చేయాలన్నారు. కాలాన్ని గౌరవిస్తూ, క్రమ శిక్షణ పాటిస్తూ విద్యాభ్యాసాన్ని పూర్తి చేయాలన్నారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ధ్యానం మానవ జీవితంపై ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంఏ యోగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com